క్లుప్తంగా

రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



ఆర్బీకేలో పచ్చిరొట్ట విత్తనాలు

నాతవరం: పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు 50 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామని ఏవో శైలజ మంగళవారం తెలిపారు. మండలానికి తొలివిడతగా జీలుగు 880 కేజీలు, పిల్లి పెసర 150 కేజీలు, జనుము 150 కేజీలు వచ్చాయన్నారు. ఆయా విత్తనాల కోసం ముందుగా ఆన్‌లైన్లో నమోదు చేసుకున్న రైతులకు ఇస్తామన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వినియోగంపై ఆర్బీకే సిబ్బంది అవగాహన కల్పించారన్నారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్‌లో వరి విత్తనాలు రైతుల అభీష్టం మేరకే సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు.

52 మందికి నేత్ర వైద్య పరీక్షలు



పైడిపాలలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యుడు

మాకవరపాలెం: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పైడిపాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి 52 మంది హాజరయ్యారు. వీరికి ఆప్తాలమిస్టులు పరీక్షలు నిర్వహించగా 20 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తించి విశాఖ తరలించారు. సర్పంచ్ రుత్తల జ్యోతి, వైఎస్సార్‌సీపీ నేత శ్రీను, క్యాంపు కోఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నర్సీపట్నం: పాలిసెట్ 2024–25 విద్యా సంవత్సరానికిగాను పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాలకు రెండో రోజు మంగళవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కొనసాగింది. 12,001 నుంచి 27 వేల ర్యాంకు వరకు వెరిఫికేషన్ నిర్వహించామని ప్రిన్సిపాల్ జి.వి.రామచంద్రరావు తెలిపారు. 102 మంది విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన చేశామన్నారు. బుధవారం 27,001 నుంచి 43 వేల వరకు వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి



నిర్మానుష్యంగా మారిన వడ్డాది- పాడేరు రహదారి

మాడుగుల రూరల్: రోహిణి కార్తెలో కాస్తున్న ఎండలకు ప్రజలు విలవిలలాడుతున్నారు. నాలుగు రోజులుగా భానుడు ఉగ్రరూపం చూపిస్తున్నారు. దాంతో ఉదయం 10 గంటలకే ప్రజలు నీడకు చేరుతున్నారు. ఎండ తీవ్రతకు తోడు ఉక్కపోత మరింత ఎక్కువై ఎవ్వరూ బయట ప్రయాణాలు చేయడం లేదు. దీంతో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. చల్లని పానీయాలకు డిమాండ్ పెరిగింది.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 148 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	5,230	5,230
మొదటి రకం	4,870	4,250
రెండో రకం	3,080	4,200
మూడోరకం	3,030	4,140

అధునాతన..వరం

అప్పటి వరకూ అక్కడ ఒకట్రెండు పక్కా ఇళ్లు తప్పితే, ఎటుచూసినా పూరిళ్లే దర్శనమిచ్చేవి. వాటిలో తలదాచుకుంటున్న పేదల అవస్థలు వర్ణనాతీతంగా ఉండేవి. మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పూరి గుడిసె లేకుండా చేశారు. వారి గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. అదే బాటలో నడుస్తూ.. ఇప్పుడు ఆయన తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు సొంతింటి కల నెరవేర్చారు. వీరిద్దరూ నర్సీపట్నం నియోజకవర్గ చరిత్రలో ఇందిరమ్మ కాలనీ, జగనన్న కాలనీ ఏర్పాటు చేసి నాతవరానికే వన్నె తెచ్చారు.



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు

- పూరింటి నుంచి పక్కాఇల్లుకు..
- వైఎస్సార్ హయాంలో ఇందిరమ్మ కాలనీ
- సీఎం జగన్ పాలనలో జగనన్న కాలనీ ఏర్పాటు
- పేదల హృదయాల్లో సుస్థిర స్థానం

నాతవరం: 2007లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇందిరమ్మ పథకం కింద నాతవరం పంచాయతీలో 850 ఇళ్లు మంజూరు చేశారు. పేదలకు ఇళ్లు మంజూరు చేసినా స్థలాలు లేక నిర్మాణం చేసుకోలేదు. దీంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట 268 మంది పేదలకు రెండు సెంట్లు చొప్పున స్థలాలిచ్చి హౌసింగ్ కాలనీ నిర్మించారు. అప్పట్లో కాలనీ వాసులు ఇందిరమ్మ మోడల్ కాలనీగా నామకరణం చేసుకున్నారు. ఈ కాలనీ ఇప్పుడు పట్టణ ప్రాంతాన్ని తలపిస్తోంది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ఒక్క ఇల్లు నిర్మించిన పాపాన పోలేదు. తాజాగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాతవరం పంచాయతీ శివారు ఆర్‌అండ్‌బీ రోడ్డును ఆనుకుని లేఅవుట్ వేసి ప్రత్యేకంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. ఇక్కడ రాజకీయాలతో పని లేకుండా అర్హతే ప్రామాణికంగా 216 మందికి స్థలాలతోపాటు ఇళ్లు మంజూరు చేశారు. జగనన్న కాలనీలో రూ.5 లక్షలతో ప్రత్యేకంగా బోర్లు తీయించి ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నారు. కాలనీకి ప్రత్యేకించి అదనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వేసి సర్వాంగ సుందరంగా వీధి రోడ్లు నిర్మిస్తున్నారు. నియోజకవర్గంలో ఎక్కడా లేని విధంగా నాతవరం పంచాయతీలో తండ్రీతనయుల హయాంలో ప్రత్యేకంగా రెండు కాలనీలు ఏర్పాటు కావడం గమనార్హం. కొన్ని నెలల క్రితం జగనన్న కాలనీని కలెక్టరు రవి పట్టన్‌శెట్టి స్వయంగా సందర్శించి ఇళ్ల నిర్మాణాలు పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ చొరవతో పలు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.



నాతవరంలో ఇందిరమ్మ మోడల్ కాలనీ

తండ్రీతనయులతో గ్రామాభివృద్ధి



మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మ మోడల్ కాలనీ నిర్మిస్తే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న కాలనీ ఏర్పాటు చేస్తున్నారు. నాతవరానికి వన్నె తెచ్చే విధంగా పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. అర్హత ఉంటే ఇల్లు మంజూరు చేశారు.

– కాపారపు అప్పలనర్స, జెడ్పీటీసీ సభ్యురాలు, నాతవరం

ప్రజలు ఆశలు నెరవేర్చుతున్నాం



ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాతవరంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి చేస్తున్నాం. గతంలో ఇందిరమ్మ కాలనీ, ఇప్పుడు జగనన్న కాలనీ ఏర్పాటు కావడం ఆనందంగా ఉంది. కొన్ని నెలల క్రితం డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, స్థానిక ఎమ్మెల్యే గణేష్ రూ.5 కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు.

– కరక అప్పలరాజు, ఉప సర్పంచ్, నాతవరం

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇళ్ల నిర్మాణ పనులను గతంలో కలెక్టరు స్వయంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు.

– జోగారావు, హౌసింగ్ జేఈ, నాతవరం మండలం

ఘనంగా హనుమాన్ నవరాత్రోత్సవాలు



రోలుగుంట హనుమాన్ దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రోలుగుంట: మండలంలో రోలుగుంట, బుచ్చింపేట, కొవ్వూరు, కొమరవోలు తదితర గ్రామాల్లో హనుమాన్ నవరాత్రోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హనుమాన్ ఆలయాల వద్ద భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. రోజూ మాలాధారులు ఆలయాలను శుద్ధి చేసి రాత్రిళ్లు భక్తిపారాయణం చేస్తున్నారు. ఈ సందర్భంగా బుచ్చింపేట, రోలుగుంట ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ వచ్చే నెల 1న హనుమాన్ జయంతి పురస్కరించుకుని ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామని, భక్తులు విరాళాలు అందించాలని కోరారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 56 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–7 యూనిట్లు, బీ పాజిటివ్–30 యూనిట్లు, బీ నెగిటివ్–2 యూనిట్లు, ఓ పాజిటివ్–12 యూనిట్లు, ఓ నెగిటివ్–1 యూనిట్, ఏబీ పాజిటివ్–3 యూనిట్లు, ఏబీ నెగిటివ్–1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష(9703619706)ను సంప్రదించవచ్చు.

విజ్ఞాన వికాసానికి గ్రంథాలయాలు



నర్సీపట్నం విద్యార్థులకు పద్యాలను వివరిస్తున్న విశ్రాంత గ్రంథాలయ అధికారి మురళీకృష్ణ



కె.కోటపాడు: నీతికథలు చదివిస్తున్న గ్రంథాలయ అధికారి పద్మావతి

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా పద్య పఠనంపై విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. విశ్రాంత గ్రంథాలయ అధికారి జి.మురళీకృష్ణ తెలుగు పద్యాలు–భావాలు విద్యార్థులకు వివరించారు. వ్యతిరేక పదాలు, సామెతలు పిల్లలతో చెప్పించారు. క్రాఫ్ట్ టీచర్ కె.రాజేశ్వరి పేపర్‌తో ఫ్లవర్స్ ఎలా చేయాలో చేసి చూపించారు. రిసోర్స్ పర్సన్ పద్మ విద్య ఆవశ్యకతను వివరించారు. గ్రంథాలయాలకు తరుచూ రావటం అలవాటు చేసుకోవాలని గ్రంథాలయ అధికారి దమయంతి సూచించారు.

చీడికాడ: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులతో కథలు, కథానికల పుస్తకాలు చదివించారు. అనంతరం మ్యూజికల్ చైర్ గేమ్ నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎం.ఎస్.ఎల్. జోగేశ్వరి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

కె.కోటపాడు: విద్యార్థులు ఉన్నత చదువులతోనే మంచి ఉద్యోగ అవకాశాలను సాధించగలరని గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. మంగళవారం చౌడువాడ శాఖా గ్రంథాలయంలో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు నిర్వహించారు. విద్యార్థులతో నీతికథలను చదివి వినిపించారు.



చీడికాడలో పాటలు పాడుతున్న విద్యార్థిని

భూసార పరీక్షలపై రైతులకు అవగాహన

రావికమతం: భూసార పరీక్షలు, వాటి ఉపయోగాలపై మత్స్యవానిపాలెం రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త స్రవంతి పాల్గొని మాట్లాడారు. పచ్చిరొట్ట ఎరువుల వాడటం వల్ల భూమి సారవంతం అవుతుందన్నారు. భూసారం తెలుసుకోవడానికి పొలంలో మట్టిని సేకరించి పరీక్ష చేయించుకోవాలని వివరించారు. వాటి ఫలితాలు ఆధారంగా సాగు చేస్తే పెట్టుబడులు తగ్గుతాయని, దిగుబడి అధికంగా ఉంటుందన్నారు. ఉచితంగా పరీక్షలు చేసి రైతులకు అందిస్తామని రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తిరుమలరావు, రామచంద్రరావు తెలిపారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త స్రవంతి

వ్యక్తిగత శుభ్రతతో స్త్రీలకు సంపూర్ణ ఆరోగ్యం

- రుతు చక్రం పట్ల మూఢాచారాలకు స్వస్తి పలకాలి
- పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీ



రోలుగుంట: కొవ్వూరులో ప్రదర్శన



కె.కోటపాడు: అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ రేవతి

దేవరాపల్లి: రుతు చక్రం ప్రతీ మహిళలో కలిగే సాధారణ ప్రక్రియని, ఆ కాలంలో వ్యక్తిగత శుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందవచ్చునని వైద్యాధికారి ఇ. పూజ్య మేఘన తెలిపారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో అంతర్జాతీయ మెనుస్ట్రువల్ హైజీన్‌డే పురస్కరించుకుని మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 9 నుంచి 18 ఏళ్ల వయసులో ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ ప్రతి నెలా ఐదు రోజుల పాటు ఉంటుందన్నారు. మూఢ నమ్మకాలతో కొంత మంది నేటికీ ఆ సమయంలో స్త్రీలతోపాటు బాలికలను దూరంగా ఉంచడం విచారకరమన్నారు. వీటికి స్వస్తి పలకి, ఆరోగ్య సిబ్బంది సలహాలు, సూచనలను తప్పకుండా పాటించాలని సూచించారు. దీనికి సంబంధించి అవగాహన చార్టులను మహిళలకు చూపించి సమగ్రంగా వివరించారు. వెలుగు ఏపీఎం ఎస్. ప్రభాకర్ రావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, ఏఎన్‌ఎం హైమా, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు ఎస్.కె. మీరాబి, సంధ్యారాణి పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లతో సురక్షిత ఆరోగ్యం

కె.కోటపాడు: కిశోర బాలికలు మంచి ఆహారపు అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా సురక్షిత ఆరోగ్యాన్ని పొందగలరని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు తెలిపారు. మంగళవారం కొత్త అగ్రహారంలో మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ రేవతి మాట్లాడుతూ రక్తహీనత సమస్య లేకుండా ఉండేందుకు వైద్య సిబ్బంది వివరించే ఆరోగ్య జాగ్రత్తలను పాటించాలని తెలిపారు. హెచ్‌వీ అచ్చియ్యమ్మ పాల్గొన్నారు.

నాతవరం: వైద్య, ఐసీడీఎస్, వెలుగు శాఖల ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో మహిళల వ్యక్తిగత శుభ్రత, ఆరోగ్య సూత్రాలు పాటించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో జాగరపు రాంబాబు మాట్లాడుతూ మహిళల బహిష్టు సమయంలో దూరంగా పెట్టి వేధింపులకు గురి చేస్తున్నారని, అలాంటి సంఘటనకు పాల్పడితే చట్ట రీత్యా నేరమన్నారు. అదేవిధంగా చిన్నారుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. గొలుగొండ ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, వెలుగు ఏరియా కోఆర్డినేటరు కె.సత్యనారాయణ, నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రాజేష్‌నాయుడు, వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు పోలుపర్తి రాధ, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

గొలుగొండ: కిశోర బాలికలకు వ్యక్తిగత శుభ్రత ఎంతో అవసరమని వైద్యాధికారి శ్యామ్ తెలిపారు. ఈ మేరకు మహిళలతో కలిసి గొలుగొండలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిశోర బాలికలు అన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు. సీహెచ్‌వో ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరులో ర్యాలీ

రోలుగుంట: మహిళా సంరక్షణ కార్యదర్శి గొర్లి వరలక్ష్మి ఆధ్వర్యంలో కొవ్వూరులో అంతర్జాతీయ మెనుస్ట్రువల్ హైజీన్‌డే మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, వైద్య ఉద్యోగులు గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వరలక్ష్మి మాట్లాడుతూ బహిష్టు సమయంలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. మూఢాచారాలతో ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. కార్యక్రమంలో హెచ్.వి. వరహాలమ్మ, ఎం.ఎల్.హెచ్.పి. రత్నం, ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.



దేవరాపల్లి: మాట్లాడుతున్న పీహెచ్‌సీ వైద్యాధికారి పూజ్య మేఘన



గొలుగొండ: అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నాతవరం: మాట్లాడుతున్న ఎంపీడీవో రాంబాబు

అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో సమస్యల తిష్ట

- పరిష్కరించాలని సభ్యులు నిలదీత
- కోడ్ అనుసరించి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు



సమావేశంలో పాల్గొన్న పాలకులు, అధికారులు

బుచ్చెయ్యపేట: గ్రామాల్లో సమస్యలపై ఆయా శాఖల అధికారులు స్పందించాలని సభ్యులు నిలదీశారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి అధ్యక్షతన మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇంటింటి కుళాయి పనులకు నిధులు మంజూరైనా కాంట్రాక్టర్ సంక్రమంగా చేయకపోవడం వల్ల గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరీష్‌ను పోలేపల్లి, వడ్డాది, విజయరామరాజుపేట, నీలకంఠాపురం సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సీతా బుజ్జి, ఎల్లపు విజయ్‌కుమార్, పడాల నాగభూషణం తదితరులు నిలదీశారు. ఎన్నికల విధులు అంటూ పలువురు అధికారులు కార్యాలయాల్లో అందుబాటులో ఉండకపోవడం వల్ల పలు రకాల పనులు ఆగిపోతున్నాయని, ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని ఎంపీపీ నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో అపరిశుభ్ర వాతావరణం లేకుండా ఉపాధి నిధులతో అన్ని గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెత్తాచెదారాలు, తుప్పలు తొలగించాలని జెడ్పీటీసీతోపాటు వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, కేపీ అగ్రహారం సర్పంచ్ గోపిశెట్టి బుజ్జి సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలానికి 50 శాతం సబ్సిడీపై పచ్చరొట్ట ఎరువులు వచ్చాయని ఆర్బీకే సిబ్బందిని సంప్రదించి పొందాలని ఏవో భాస్కరరావు తెలిపారు. తీవ్ర ఎండల దృష్ట్యా ప్రజలు తమ పనులను ఉదయం 9 గంటలలోపు సాయంత్రం నాలుగు గంటల తర్వాత చేసుకోవాలని, వడదెబ్బకు గురైతే వైద్య సేవలు అందించాలని బుచ్చెయ్యపేట, తురకలపూడి, వడ్డాది ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు సూచించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గౌరవ సభ్యులు మండల సమావేశం ప్రశాంతంగా జరిగేలా సహకరించారు. ఎంపీడీవో టి. వెంకటాచార్య, ఏపీవో మురళి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమణ

అనకాపల్లి: అనకాపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని రాజుపేటకు చెందిన భార్యభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. రాజుపేటకు చెందిన భీశెట్టి వెంకటరమణ భార్య, కుమారుడితో కలిసి విశాఖపట్నం వెళుతున్నారు. అనకాపల్లి మెయిన్‌రోడ్డు డైట్ కళాశాల వద్ద బైక్‌పై వెళుతున్న భార్యభర్తలను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో వెంకటరమణకు, అతని భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాబు సురక్షితంగా బయటపడ్డాడు. క్షతగాత్రులను ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. దీనిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

త్రిపురాంతకస్వామికి పుష్పాంజలి

కశింకోట: స్థానిక పురాతన శివాలయంలో కొలువైన సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామికి మంగళవారం రాత్రి కన్నుల పండువగా పుష్పాంజలి నిర్వహించారు. ఈ నెల 23న స్వామి కల్యాణోత్సవాన్ని భారీగా జరిపిన విషయం తెలిసిందే. ఉత్సవాల ముగింపు రోజున నిర్వహించే పుష్పాంజలి సందర్భంగా స్వామివార్ల కల్యాణోత్సవ విగ్రహాలను నూతన వస్త్రాలు, మల్లె పూల మాలలతో అందంగా అలంకరించారు. పలు రకాల తీపి పదార్థాలు, పండ్లు, ఇతర పదార్థాలు, పాలు, సుగంధ ద్రవ్యాలు నివేదించి, పూజలు చేశారు. ఊయలలో కల్యాణమూర్తులను నిలిపి లాలించారు. భక్తులు భక్తి పారవశ్యంతో పాటలు పాడారు. ఉదయాన్నే స్వామి మూల విరాట్‌ను, అమ్మవారిని అందంగా అలంకరించి తొలుత పూజలు జరిపారు. ప్రసాద వితరణ చేశారు. స్థానిక విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు భీమిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులకు కూల్ డ్రింక్‌లు పంపిణీ చేశారు.

వైభవంగా పెద పైడితల్లమ్మ పెద్ద పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న అనురాధ



ఆలయం వద్ద భక్తుల రద్దీ

కె.కోటపాడు: చౌడువాడ గ్రామ దేవత పెద పైడితల్లమ్మ పెద్ద పండగను మంగళవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. చెక్క గుర్రాలతో ఊరి పొలిమేర్లలో పాలధార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని వీక్షించారు. ఉదయం నుంచి ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. వైఎస్సార్‌సీపీ మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ ప్రత్యేక పూజలు చేశారు. ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజి శ్రీను, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆకుల సాయిప్రసాద్, వార్డు మెంబర్ చల్లా సురేష్ పాల్గొన్నారు. పండగ సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఎస్‌ఐ లక్ష్మీనారాయణ ప్రత్యేక చర్యలు చేపట్టారు.